చిత్ర జగం

• శ్రీ పేకమళ్ళ కామేశ్వరరావు •

తానొక అసాధ్యుడనని చిత్రకూటారావు అభిప్రాయం అతనికి అసలు చదువుకన్న సినీమా చదువు జాస్తి. దానిలో తరగతులు, పరీక్షలు లేవు గాని ఉంటే స్కూలు ఫైనల్ ఎప్పుడో పాసయ్యేవాడు. అసలు చదువులో పాపం నాలుగో ఫారం రెండోమారు చదువుతున్నాడు వయస్సు పదహారు నిండేయి.

చిత్రకూటారావుకి తెలియని ఫిల్ము స్టారు పేరులేదు, ఫిల్ము పేరులేదు, ఫిల్ము కంపెనీ పేరు మొదలే లేదు. అతని గదినిండా, పెట్టెలనిండా, పుస్తకాలనిండా సినీమా బొమ్మలే!

రాజమహేంద్రవరం వచ్చిన ప్రతి ఫిల్ము అతను చూడనిదే వెళ్ళదు. కొత్తఫిల్ము వచ్చిందంటె మొదటి రోజు ప్రదర్శనానికి వెళ్ళితీరేడన్నమాటే! 'సంసారాని'కి ఇరవై సార్లు, అంతకు మునుపు 'బాలరాజు'కి ముప్పైసార్లు వెళ్ళేడు. ఇతనికి టిక్కెట్టుకి డబ్బు ఎవరిస్తారని ప్రశ్న. ఒక్కొక్కప్పుడు అమ్మకి తెలియకుండా నాన్నని, నాన్నకి తెలియకుండా అమ్మని టోపీలో వేస్తూంటాడు ఇంటికి వచ్చి పోతూండే బంధువుల, స్నేహితుల దగ్గర సినీమా వాఙ్మయం ఏకరువు పెట్టి బేలు వేస్తాడు అవీకాకపోతే ఇంటర్‌వల్ సమయాన గేటు దగ్గర కనిపెట్టుకొని ఉండి తొంబల్లో దూరిపోతాడు. గేటుచెక్కర్లతో కొంత స్నేహం సంపాదించేడు కాబట్టి వాళ్ళు ఒక్కొక్కప్పుడు చూసీ చూడకుండా విడిచిపెట్టివేస్తారు.

రాత్రి దీపం దగ్గర కూర్చుని చిత్రకూటారావు మోహానికి ఎదురుగా పుస్తకం పెట్టుకొన్నాడు. అప్పుడప్పుడు పుస్తకంలో మాటను గొణుగుతున్నాడు. కాని మనస్సులో ఒక ఆలోచనాఫిల్ము ప్రవహిస్తూంది "ఎవరికీ చెప్పకుండా చెన్నపట్టణం పారిపోవాలి. సినిమా స్టూడియోలో చేరిపోవాలి. నాయకుడి పాత్ర ధరించాలి. అప్పుడు నాచుట్టూ బోలెడు మంది స్త్రీ పురుషులు చేరి ఇతను ఎంత అందగాడో, ఎంత బాగా నటిస్తాడో, 'ఇతాచేస్తే వుర్రాడు' అని మెచ్చుకొంటూంటారు అప్పుడు నేను సిగరెట్టు దమ్ము తీసి రీవిగా మాట్లాడుతూనే ముక్కు, నోట పొగ వదులుతాను నన్ను ఇన్ని ఇబ్బందుల పాలు చేస్తున్న మా నాన్నకి మాత్రం కబురుపంపించను గింజుకోనీ! మా అమ్మకి మాత్రం, చాటుగా వచ్చి నన్ను చూసి వెళ్ళవలసిందని ఉత్తరం రాస్తాను." ఇంతలో పిల్లొకటి గదిలోకి తొంగి చూసింది చిత్రకూటారావు ఒక్క గంతువేసిలేచి దానిని తరుముకొంటూ పోయేడు. తిరిగి వచ్చి తలుపులు బిడాయించి నిద్రపోయేడు

ఒక మంచి రోజు చూసి చిత్రకూటారావు తన చెల్లెలి పులిగోళ్ళ పతకం లంకించుకొన్నాడు బజారులో అమ్మి డబ్బులు చేత వేసుకొన్నాడు. "ఈ రోజే ప్రయాణం. నేను ముందు ముందు సినీమాలలో ఎన్ని సాహస కృత్యాలు చెయ్యాలో ఏమిటో! అటువంటి వాణ్ణి డబ్బిచ్చి టిక్కెట్టు కొంటానూ! తప్పు తప్పు!" అనుకొంటూ మెయిల్ ఎక్కేడు రైలు నడుస్తూండగానే ఒక పెట్టెలోనుంచి మరొక పెట్టెలోకి మెట్లమీంచి నడచి వెళ్ళేడు ఒక్కొక్కప్పుడు అందరి కాళ్ళు అడ్డు ఉండగా కనబడకుండా సీట్లు కింద నక్కేవాడు మరొకప్పుడు రైలు పెట్టె కింద బ్రహ్మదేవుడికేనా కనబడకుండా దాగుకొని బండి ఆగనిచ్చి బైటికి వచ్చేవాడు.

చెన్నపట్టణం ప్లాటుఫారం మీద దిగేడు. గేటుదాటి ఆకాశాన్ని అంటుతుందా అన్నట్టు ఉన్న సెంట్రల్ స్టేషన్ కప్పుని చూసి ఆశ్చర్య పోయేడు. మొదటిసారి ట్రామ్ బండిని విచిత్రంగా చూసేడు రోడ్డుమీద మితిలేని కోలాహలాన్ని, మోటారుకార్ల వరుసలను చూసి ఏదో కొత్త ప్రపంచకంలోకి వచ్చిపడ్డాను అనుకొని తమాయించుకొన్నాడు. రిక్షావాడు దగ్గరకిరాగా "హోటేలు లాడ్జికి తీసుకుపో!" అంటూ దర్జాగా చెప్పేడు వాడు తీసుకువెళ్ళి ఒక హోటేలు ముందు రిక్షా ఆపేడు. చిత్రకూటారావు దిగి, లోపలికి వెళ్ళి, గుమ్మం ప్రక్కని టేబుల్ దగ్గర

కూర్చుని డబ్బులు వసూలు చేస్తున్న ఆసామిని "గదికి అద్దె ఎంత?" అని ప్రశ్నించేడు

"రెండు రూపాయలు."

"నెలకా?"

"ఏమి, పిచ్చివాడివా నువ్వు! ఒక్క రోజుకి!"

చిత్రకూటారావు పిచ్చెత్తిన వాడిలాగే చూసేడు. కాని తమాయించుకొని తల ఆడించి "సరే!" అన్నాడు

అతను గదిలో ప్రవేశించి తక్షణం తాళం వేసి హేర్ కటింగ్ సెలూన్‌కి వెళ్ళేడు షోకుగా క్రాపింగు చేయించేడు అతి నవీనంగా ఉండ దలిచేడు తలకి వాసననూనె పులిమేడు మొహానికి పల్చగా ఫేస్ పౌడరు కొట్టేడు షోకు కళ్ళజోడు, అత్తరువు పూసిన చేతిరుమాలు, బనియను పైన పల్చని షర్టు, పంట్లాము, బాటా జోళ్ళు ధరించేడు

అతనికి ఫిల్ము స్టూడియోల, ఫిల్ము కంపెనీల పేర్లు కంఠగతమేకాని అవెక్కడెక్కడ ఉన్నదీ తెలియదు. కాబట్టి ఇతరుల నడిగి తెలుసుకో దలిచేడు. అనేక స్టూడియోలు, ఫిల్ము కంపెనీలు నక్షత్రాల పేర్లు కలిగి ఉండడంచేత ఒకటి తోచింది ఇరవై యేడు నక్షత్రాల పేర్లు జాబితాగా వ్రాసి స్టూడియో, ఫిల్ము కంపెనీల పేర్లు అయిన వాటిని ఉంచి, మిగతవాటిని కొట్టి పారవేసేడు ఇతరుల నడిగి మిగత వాటి ఉనికి తెలుసుకున్నాడు

బస్సు దిగి ఒక సినిమా ఆఫీసుకి వెళ్ళేడు. దాని తాలూకు స్టూడియో మరొకచోట ఉంది. వెలుపలి గేటు దాటి, లోపలి గేటు దగ్గరకి వెళ్ళేడు గేటుని అంటిపెట్టుకొని ఉన్న భోగట్టా ఆఫీసుకి వెళ్ళి ఇటు అటు తొంగి చూస్తూవుంటే "ఎవరు మీరు?" అన్నాడు గుమాస్తా.

"నేను చిత్రకూటారావుని"

"ఎవరికోసం దయచేసేరు?"

గుమాస్తా అంత మర్యాదగా మాట్లాడుతూంటే చిత్రకూటారావు తన రొట్టె నేతపడిందనుకొని "ప్రొప్రయిటర్ కోసం" అన్నాడు.

"వారు ఇప్పుడు ఇక్కడ లేరు ఉన్నా, ఫిల్ము రిలీజు తొందరలో ఉంటారుగాబట్టి వారం రోజుల దాకా ఇంటర్వ్యూలు ఇవ్వరు మీరు కావలిస్తే ఇంటికివెళ్ళి చూడండి" అని అతి మర్యాదగా చెప్పేడు

"ఇంటి నెంబరు" అని చిత్రకూటారావు అడగ్గా, గుమాస్తా చెప్పిన దాన్ని కాగితంమీద గుర్తించుకొన్నాడు. మళ్ళీ బస్సు ఎక్కేడు. ప్రొప్రయిటర్ మేడ గేటుని చేరుకొన్నాడు గేటు దగ్గిర గూర్ఖావాడు మొలని కత్తితో సిద్ధంగా ఉన్నాడు.

చిత్రకూటారావు శుద్ధ తెలుగులో ప్రశ్నించేడు.

గూర్ఖావాడు ఏదో మారు పలికేడు.

చిత్రకూటారావు "మీకు ఇంగ్లీషు వచ్చా?" అన్నాడు. గూర్ఖావాడు చేతితో రాదని సంజ్ఞ చేసి "తమిళం" అని ప్రశ్నార్ధకంగా చేతిని ఆడించేడు

చిత్రకూటారావుకి అర్ధం కాలేదు. అక్కడ సామాన్య భాషాసమస్య వచ్చింది. కాని అతనికి చటుక్కున స్ఫురించి తన పేరున్న చీటి ఇచ్చేడు.

గూర్ఖావాడు 'ప్రొప్రయిటర్' అని చేతితో లేడని సంజ్ఞచేసేడు

చిత్రకూటారావు ఆలోచనలో పడ్డాడు. 'ప్రొప్రయిటర్ స్టూడియోలో లేడు, ఇంటి దగ్గరా లేడు ఇంక ఆకాశంలో పట్టుకోవాలంటే నాకు రెక్కలు లేవు వసుదేవుడంతటి వాడే గాడిద కాళ్ళు పట్టుకొన్నాడట! కాబట్టి నేను వెళ్ళి గుమాస్తాగారి కాళ్ళు పట్టుకొంటాను' అని బయలుదేరి తిరిగి ఆఫీసుకి వచ్చి, గుమాస్తాతో తన పని సవిస్తరంగా తెలియజేసుకొని, ప్రొప్రయిటర్ ఎక్కడ వున్నారో తెలియగోరేడు.

"అలాగా! సరి సరి! మీ ఫోటో ఎడ్రసు ఇచ్చి మీ ఊరికి పొండి మీకు ఇంటర్వ్యూ రావచ్చు" అన్నాడు.

"ఓహో! ఇదొకటా! సరి! సరి అలాగే!" అంటూ చిత్రకూటారావు బైటికి వచ్చేడు అప్పటి కప్పుడే కడుపులో కాలుతుండగా దగ్గరున్న హోటేలుకి వెళ్లి, ఆకలి మంట చల్లార్చేడు.

అతను ఫొటో స్టూడియోకి వెళ్ళేడు అక్కడి ఆసామితో "నేను సినీమార్థిని నాకు ఫొటో కావాలి" అన్నాడు.

"అయితే నేను కొన్ని స్టిల్సు తీసి ఇస్తాను ఒక్కొక్క భంగిమకు పదిహేను కాపీలు దగ్గర పెట్టుకోండి అందరి, మొహాన్ని తలొక దొంతర కొట్టండి_ ఎక్కడ తగులుతే అక్కడ తగులుతుంది", అని ఆర్టిస్టు ఉపాయం చెప్పేడు

సినీమార్థి వివిధ భంగిమలలో ఫొటోలు తీయించుకొని, డబ్బు చెల్లించి స్టిల్సు చేత పట్టుకొన్నాడు

అతను మరొక స్టూడియోకి బయలుదేరేడు స్టూడియో మొదటఉన్న ఆఫీసు చేరుకొన్నాడు వరండాలో నాలుగు కుర్చీలు, మధ్య నొక మేజాబల్ల ఉన్నాయి కుర్చీమీద కూర్చున్నాడు కొత్తగా సిగరెట్టు అలవాటు చేసుకొంటు న్నాడు ఒక బంట్రోతు వచ్చి "ఏమిపని సార్!" అని అడిగేడు

"ఆఫీసు మేనేజరుగారితో మాట్లాడాలి" అని పేరు చీటిని ఇచ్చేడు సినీమార్థి బంట్రోతు వెళ్ళాడు.

ఎదుటనున్న తోటలోని మొక్కలను, పువ్వులను చిత్రంగా చూస్తూ సిగరెట్టుతో సరసాలాడుతున్నాడు చిత్రకూటారావు. రక రకాల మోటారు కార్లు వస్తున్నాయి, వెళుతున్నాయి. వింత వింత డ్రెస్సులు, వన్నెలుగల మగవారు, ఆతరువాత పెద్దలు, పిన్నలు కార్లలో తిరుగుతున్నారు వారిలో కొందరిని చూసి చిత్రకూటారావు ఉలికి పడ్డాడు. "ఇది వరలో వెండి తెరమీద చూసిన మొహాలే ఇవి!" వారి పేర్లను స్మరణకి తెచ్చుకొని రూఢి చేసుకోడం కోసం పక్కని తిరుగుతూన్న వాళ్ళని అడిగేడు నిశ్చయపరుచుకొని ఆనందించేడు తాను కూడ కారుమీద తిరిగే కాలాన్ని గురించి కలలు కన్నాడు ఆఫీసునుంచి ఏజవాబు రాలేదు.

ఇంతలో ఒకాయన వచ్చేరు పక్కన కుర్చీమీద కూర్చున్నాడు. ఎర్రగా, లావుగా ఉన్నాడు అదనంగా కోటొకటి ఉంది ఆయన ఎదుట కూర్చున్న కుర్రవాణ్ణి చూసి భోగట్టా కోసం "ఎవరండిమీరు?" అని అడిగేడు

చిత్రకూటారావు "మీరెవరు?" అని ఎదురు ప్రశ్న వేశాడు

"నాసంగతి చెప్పకుండా మీసంగతి తెలుసుకో దలుచుకో లేదు క్లుప్తంగా వినదలుచుకొంటే, నేనొక అభాగ్య జీవినని మాత్రం తెలుసుకోండి" అన్నాడు.

"ఎందుచేత?"

"ఇప్పటికి ఈ సినీమాకంపెనీల చుట్టు ఏడాదిపైబడి తిరుగుతున్నాను. ఒక్కడినీ ఈ పట్టణంలో పడుంటే పెళ్ళాం పిల్లల గతేమిటని, వాళ్ళని కూడా ఇక్కడికి తీసుకు వచ్చి మకాం పెట్టేను ఈ ఆఫీసులచుట్టు ప్రదక్షిణాలు చేస్తూంటాను" అన్నాడు ఎదుటాయన

చిత్రకూటారావుకి నవ్వు వచ్చింది తనలో "వట్టి తెలివి తక్కువ వాడు కాకపోతే ఇన్నాళ్ళవరకు ఏదోఒకటి కుదరక ఉండిపోతాదా! నేను నాలుగు రోజులలో ఎక్కడో ఒకచోట ఫిక్స్అప్ అయిపోనా?" అనుకొంటూ, పైకి "పేరు?" అన్నాడు

నా పేరు "శివశరణం"

చిత్రకూటారావుకి బాగా అర్థం కాలేదు 'చ'కి'శ' అంటూన్నాడేమో అని అనుమానం కలిగింది "మీరు శివ చరణమా లేక శివశరణమా?" అనిసూటిగా ప్రశ్నించేడు

"అనేకమంది నా పేరు విని ఆలాగే పొరపాటు పడుతూంటారు మా పెద్దలు శివశరణ మనే పేరు పెట్టేరు. వారు పెట్టిన పేరు ఎంత తగినదో ఆత్మానుభవంవల్ల గ్రహించగులుగుతున్నాను అన్యథా శరణం నాస్తి శివేన శరణం మమ" అన్నారు.

ఆమాటలు విని చిత్రకూటారావు "వట్టి క్రాక్!" అని లోపల అనుకొని శ్లోకాలు గీకాలు చూస్తే కాస్త చదువు కొన్న మనిషిలాగే ఉన్నాడని తలచి "ఏమైనా చదువు కొన్నారా?" అన్నాడు.

"బి ఏ చదువుకొన్నాను"

చిత్రకూటారావు విస్తుపోయేడు తనలో "బి. ఏ. చదువుకొన్నాడు, పాపం! ఎందుకు? తలకాయలేదు తెలివి లేకపోతే దమ్మిడీకి మారకపోవచ్చుకదా" అనుకున్నాడు

"నాచేత మీరు ఊరికే వాగిస్తున్నారుకాని, మీసంగతి రవ్వంతైనా చెప్పలేదు ఆఖరికి మీ నామధేయంలోని

సువర్ణాక్షరాలనుకూడ తెలియజేయలేదు" అన్నాడు శివశరణం.

"నాపేరు చిత్రకూటారావు అంటారు"

"అలాగా! చాల సంతోషం! మీరు ఏదేనా పనిమీద వచ్చేరా ఇక్కడికి?"

"ఏదైనా ఒక ఫిల్ములో హీరోగా బుక్ అయిపోదామని వచ్చాను." అన్నాడు సినీమూర్థి.

శివశరణానికి నవ్వువచ్చింది. కాని ఏడుపుగామారి, చివరికి జాలిగా పరిణమించింది అయితే పైకి ఏమనాలో తోచలేదు ఎదుటనున్నవాడా కుర్రవాడు! ఏమంటే ఏమి తప్పు పట్టుకుంటాడో అని జడిసి "ఎన్నాళ్ళనుంచి ప్రయత్నం చేస్తున్నారు" అని సవినయంగా అడిగేడు

"ఏదీ నిన్ననే మెయిల్ దిగాను!"

"ఇంతేనా?"

"మరొక నాలుగు రోజులలో బుక్ అయిపోతాను"

"చాల సంతోషం! ఎక్కడేనా జ్యోతిషం చెప్పించుకొన్నారా?"

"నాకటువంటివాటిలో మొదటినుంచి నమ్మకంలేదు"

"పోనీ ఏ ప్రొప్రయిటరుగాని, డైరెక్టరుగాని వాగ్దానం చేసేరా?"

"అబ్బే! ఇంకా ఎవ్వరినీ చూడందే!"

"మరయితే నాలుగు రోజులలోనే బుక్ చేస్తారని ఎట్లా గ్రహించారు?"

"మీకు తెలియక పోవచ్చుకాని నాకు తెలుసు" అన్నాడు చిత్రకూటారావు ఆత్మవిశ్వాసంతో

శివశరణం తనలో తాత్వికంగా విచారించాడు "ఈ ఎండమావులను నమ్మి ఎంతమంది చిన్నవాళ్ళు, పెద్దవాళ్ళు, ఆడవాళ్ళు, డబ్బు, కాలం, జీవితం వృధా చేసుకుంటున్నారో!" అనుకొన్నాడు

"మీరు ఎదో ఆలోచిస్తున్నారు పైకి చెప్పకుండా!"

"అబ్బే! ఏమీలేదు మీకింకా అనుభవం కలగాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నాను."

"పట్టి పూర్వకాలపు మనిషి!" అనుకొని సినీమూర్థి "అదెందుకొచ్చిన వేదాంతం!" అని కొట్టిపారేశాడు.

"నిజమే అయుండవచ్చు కాని—మీ రెవరినైనా డైరెక్టరుని చూశారా?" అని ప్రశ్నించాడు.

"డైరెక్టరుతో మనకేం పని! తిన్నగా స్టూడియో ప్రొప్రయిటర్ నే వలలో వేసుకుంటే తీరిపోతుంది!" అని చిరునవ్వు నవ్వేడు

"పోనీ ప్రొప్రయిటర్లను, డైరెక్టర్లను కూడ కలుసుకొని చూడండి!"

ఆమాట చిత్రకూటారావుకి నచ్చలేదు. తన ప్రజ్ఞని రుచి చూపించదలుచుకున్నాడు. "అసలు వీళ్ళు 'చిత్రజగం' అనే ఫిల్మును తియ్యబోతున్నారు ఆసంగతి తెలుసా?" అన్నాడు.

"నేనూ ఆసంగతి మొన్న మొన్ననే విన్నాను. దాని కోసం కూడ కొంత ప్రయత్నం చేస్తున్నాను" అన్నాడు శివశరణం.

ఇంతలో బంట్రోతువచ్చి "మేనేజరుకి ఎవరిని చూడడానికి టైంలేదు, దరఖాస్తు, స్టిల్సు ఇచ్చి వారంరోజులయేక కనబడమన్నారు" అని ఉమ్మడిగా చెప్పేడు. చిత్రకూటారావు దరఖాస్తు, స్టిల్సు అందజేశాడు. శివశరణం కాళ్ళకు బుద్ధిచెప్పదలిచేడు ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ పోయేరు

చిత్రకూటారావు ఆరోజంతా భోజనం మానివేసి, ఫలహారాలతో కాలక్షేపం చేస్తూ, సినీమా ఆఫీసులు, స్టూడియోలవెంట తిరిగేడు. బరువైన కాళ్ళతో రాత్రి లాడ్జి చేరుకున్నాడు బల్లమీద శరీరం వాల్చాడు "ఎక్కడ పట్టినా చిక్కని ఆశ కనబడుతూంది" అనుకుంటూ నిద్రాదేవత వడిలో సమస్తమూ మరిచిపోయేడు.

అతను పొద్దున్నే లేచి ముస్తాబై ఎప్పటి పనిమీద బయలుదేరేడు ప్రతిచోట స్టిల్సుగుత్తడం ఇస్తూండేవాడు. కొండంత ఆశతో ముందుకు సాగిపోయేవాడు అతను వెళ్ళిన చోటల్లా శివశరణం తారసిల్లేవాడు. ఇద్దరూ కాస్త

బాతాఖానీ !

చిత్రకూటారావు వారంరోజులు అదేమోస్తరుగా విధి విరామం లేకుండా తిరిగేడు. ఆశ విషయంలో మొదటి రోజున ఎట్లాగుందో చివరి రోజునా అట్లాగే ఉంది "కాని చెన్నపట్నంలో బ్రతికేదెట్లా? తెచ్చిన పైకం పూర్తయిపోయింది లాడ్జికి గుడ్ బై కొట్టి రాత్రుళ్ళు సత్రం అరుగు మీద ఒరగవలసిన గతి పట్టింది పోనీ ఎవరి పంచనైనా పండుకొందామంటే వీధి అంచుదాక ఇంటిగోడే ఉంటుంది కాని పంచ ఉండనియ్యరు ఇక్కడి ధర్మాత్ములు మనిషి నీళ్ళు పోసుకోకపోయినా, చింకిగుడ్డలు కట్టుకున్నా, నిద్రకి పరుపులేకపోయినా కుదురుతుందికాని, కడుపుకి ఏదో ఒకటి పారెయ్యకపోతే కుదరదు అప్పటికీ భోజనం మాని ఫలహారాలతో గడుపుతున్నాడు. ఈ మహా పట్టణంలో పిడికెడు పెట్టే ధర్మాత్ములు లేరు డబ్బు పుచ్చుకొని తిండిపెట్టేవాటికి ధర్మసత్రాలని పేరు నాయకుడి పాత్ర కాకపోయినా ఆఖరికి ఎక్స్ట్రాగా నేనా తీసుకుంటారని రూఢి కనపడదు స్టూడియో పైగోడలేకాని లోపల యెట్లాగుంటుందో చూడలేదు. అంతా అగమ్యగోచరంగా ఉంది" అని తలపోశాడు

వారు చెప్పినవారం పూర్తయిందికదా అని అతను రెండోసారి దర్శించిన సినీమా స్టూడియోకి బయలుదేరి వెళ్ళి మేనేజరతో "మీరు వారం అయేక ఒకసారి కనబడమన్నారు" అని వినయంగా అన్నాడు.

"మిమ్మల్ని నేను కనబడమనలేదు మీకు అవసరమైతే వచ్చి తెలుసుకోండి అన్నాను అసలు ఇంకా పనులు మొదలుపెట్టలేదు మరి పదిహేను రోజులకుకాని ప్రారంభం కాకపోవచ్చు" అన్నాడు

సినీమార్థికి మెలకువో కలో తోచలేదు తనలో "కనపడమన్నమాట మరొక రూపం దాల్చింది. ఒక వారం రెండు వారాలయింది ఇవి కొత్తరకం లెక్కలు కాబోలు, ఈవరబడిని రెండు వారాలు నాల్గు వారాలు కావని మనం వాదించలేము" అనుకుంటూ అయోమయంగా గడప దాటగా, శివశరణం ఎదురుపడ్డాడు.

వెల వెల పోతూన్న చిత్రకూటారావు మొహం చూసి శివశరణం "మీరెక్కడేనా బుక్ అయేరా?" అన్నాడు నమ్మకంలేకుండానే

"బుక్ కాదు, బొగ్గయేను."

"మీకూ కొంచెం అనుభం కలుగుతూందన్నమాటే! ఇంకేమి! ఇవన్నీ ఎండమావులు! ఇక్కడ మీకు ఎవ్వరూ కూడా, నువ్వు రావద్దనీ, నీకు ఇచ్చేదేమీ లేదని చెప్పరు మీరు ఎన్నిసంవత్సరాలపాటు గుమ్మం ఎక్కినా వద్దనరు నెల, రెండు నెలలని వాయిదా వేస్తూనే ఉంటారు. విసుగెత్తి మీరు తగ్గవలసిందే! ఈమోస్తరుగా ఆశపడుతూ వచ్చే పోయేవాళ్ళ సంఖ్య వందలమీద, వేలమీద ఉంది. ఆక్టర్లేమిటి, టెక్నీషియన్లేమిటి, రచయితలేమిట, ఉద్యోగాన్వేషకులయితే ఏమిటి, ఈ చిత్రం ఇప్పటికి ఏడాదినుంచి చూస్తున్నాను"

తనవంటి ఆశాపరులు చాల మంది ఉన్నారని తెలిసినమీదట సినీమార్థికి కొంచెం స్వస్థత కలిగింది.

"మీ ముందు కార్యక్రమమేమిటి?" అని యధాలాపనగా అడిగేడు శివశరణం

తన బాధలు వెళ్ళబోసుకోడానికి ఒక స్నేహితుడు దొరికేడుకదా అని చిత్రకూటారావు సంతోషించేడు తన చరిత్రను, ఇప్పటి తన అవస్థను సంగ్రహంగా తెలియజేశాడు

శివశరణం విని నిశ్చేష్టుడై విచారించేడు.

సినీమార్థికి "నేను ఏదైనా హోటేలులో చిప్పలు కడుగుకొని బతకాలని చూస్తున్నానండి ఇంటికి వెడితే తిట్లు, తన్నులు తప్పవు జీవించడానికి మరొక మార్గం లేదు" అన్నాడు

శివశరణానికి చటుక్కున ఏదో స్ఫురించింది "మీకు వార్తా పత్రికలు చూసే అలవాటుందా?" అని అడిగేడు

"అందులో ఏముంటుంది ఒకవేళ బేడ ఇచ్చి కొన్నా బొమ్మలు చూస్తే చూడాలికాని అంతకన్నా ఏముంటుందిలెండి?"

"అది సరే! నిన్న చదివినదొకటి జ్ఞాపకానికి వస్తూంది మీతండ్రి పేరు శంభుదాసయ్యేనా?" అని అనుమానిస్తూ అడిగేడు శివశరణం.

"ఆఁ! ఆఁ! మీకెలా తెలిసిందండి ఏమైనా యక్షిణీ విద్య ఉందా యేమిటి?" అని చిత్రకూటారావు విచిత్ర పడుతూ అడిగేడు

"సరి! సరి! మీది రాజమహేంద్రవరమే కాదూ!"

"ఔనాను! ఏమివచ్చింది?"

"సరే అయితే! మిమ్మల్నిగురించే మీ తండ్రిగారు ప్రకటన చేసేరన్నమాట! నిన్నటి దినపత్రికలో ప్రకటన మిమ్మల్నిగురించే! మీ చరిత్ర కొంత చెప్పేవరకు నాకు స్ఫురించలేదు దానిలో అచ్చువేసిన ఫొటోకి మీకు చాల పోలికలున్నాయి మీరు చెప్పినదాన్ని బట్టి రుజువయింది ఆప్రకటన ఏమిటంటే— మీతండ్రిగారు మిమ్మల్ని ఇంటికి రమ్మనీ, మరేమీ భయపడవద్దనీ, మీఅమ్మ మీకోసం బెంగ పెట్టుకొని తిండి మానివేసిందనీ, మీ అన్నలు, చెల్లెళ్ళు, మీ బంధువర్గం మీ కోసం ఎంతో ఆత్రంగా ఎదురుచూస్తున్నారని ఉంది" అన్నాడు

తల్లిమాట జ్ఞాపకం రాగానే చిత్రకూటారావుకి దుఃఖం ఆగలేదు వలవల ఏడ్వ మొదలుపెట్టేడు

"విచారించి దేనికీ ప్రయోజనంలేదు కాబట్టి మీరు ఇంటికి వెళ్ళడానికి ఎంతమాత్రమూ సంకోచించవద్దు ఈ ఎండమావులను నమ్ముకొని మోసపోవద్దు ఈరోజే ఇంటికి బయలుదేరండి!" అన్నాడు మిత్రుడు

అటువంటి చక్కని ఆధారం దొరికినందుకు చిత్రకూటారావు దేవుడికి మనస్సులో వెయ్యి దండాలు పెట్టుకున్నాడు

"మరయితే టిక్కెట్టు మాటేమిటి?" అని అడిగేడు శివశరణం

"టిక్కెట్టు మాట మనకి తేనేలేదు హరిబ్రహ్మాదులు పట్టుకోలేరు"

"వద్దు వద్దు! అటువంటి సాహసం వద్దు నేను మీతండ్రిగారిపేర మీకు డబ్బు పంపవలసిందని టెలిగ్రాం ఇస్తాను. సుఖంగా వెళ్ళవచ్చు" అన్నాడు

చిత్రకూటారావు కృతజ్ఞతకి మాటలు చాలలేదు.

ఇద్దరూ కలిసి పోస్టాఫీసుకి బయలుదేరేరు దారిలో శివశరణం "ఇదొక చిత్రజగం! దీని నాయకులు మీరు సుమండీ!" అన్నాడు

అర్థంగాక చిత్రకూటారావు దిక్కులు చూశాడు. ★

మీ బిడ్డ మామూలుగా భుజించనిచో

మందంగా వుండి, పొట్ట ఉబ్బివున్నచో, బహుశా కడుపులో బల్ల (లివర్) పెరుగుతుండవచ్చు యీ లివర్ వ్యాధి సాధారణముగా 3 సంవత్సరాలలోపు పిల్లలకు వచ్చుట సహజము.



జమ్మి వారి

లివర్‌క్యూర్

లివర్ & స్ప్లీన్ వ్యాధుల చికిత్సకు, నివారణకు



ఇప్పుడు మాత్రల రూపంలో లభిస్తున్నది.

జమ్మి వెంకటరమణయ్య అండ్ సన్స్,
'జమ్మి బిల్డింగ్స్', మైలాపూర్, మద్రాసు
శాఖ పోరుగంటివారి వీధి, విజయనగరం సిటీ,
మరియు ఇతర సలములలో.